
## 'దళితబంధు' నిధులివ్వండి



డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు వినతిపత్రం అందజేస్తున్న కామారెడ్డి దళితబంధు లబ్ధిదారులు

### డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు లబ్ధిదారుల వినతి

కామారెడ్డి/రాజంపేట్, ఫిబ్రవరి 25 : కామారెడ్డి జిల్లాలోని దళిత బంధు లబ్ధిదారులు ఆదివారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిశారు. దళిత బంధుకు ఎంపికైన లబ్ధిదారులకు నిధులు విడుదల చేయాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో స్వామి, రవీందర్, నర్సింహులు, రాజు తదితరులు పాల్గొన్నారు.




కల్యాణమండపాన్ని ప్రారంభిస్తున్న బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి

# పెత్తనం ఎవరిది ?

- నిజామాబాద్‌ను వదలని షబ్బీర్
- ప్రభావం చూపుతున్న మహేశ్‌గౌడ్
- అయోమయానికి గురవుతున్న శ్రేణులు
- కామారెడ్డి నియోజకవర్గంపై కొండల్‌రెడ్డి చూపు
- రసకందాయంగా మారుతున్న హస్తం రాజకీయం

కాంగ్రెస్ పార్టీలో గందర గోళం



నిజామాబాద్, ఫిబ్రవరి 25(నమస్తే తెలంగాణ ప్రతినిధి): కాంగ్రెస్ పార్టీలో నియోజకవర్గ ఇన్‌చార్జీలు ఎవరన్నది పెద్ద పజిల్‌గా మారింది. ఎన్నికలయ్యాక ఓటమి చెందిన చోటనే ఇదంతా చోటు చేసుకుంటుండడం ప్రాధాన్యతను సంతరించుకున్నది. అధికార పార్టీ కాంగ్రెస్‌లో నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. నియోజకవర్గానికి ఇన్‌చార్జి ఎవరన్నది తెలియక కిందిస్థాయి శ్రేణులు తీవ్ర అయోమయానికి గురవుతున్నాయి. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో నియోజకవర్గానికి ఆశాదీపంగా ఎవరు బరిలో ఉన్నారన్నది తెలియకపోవడంతో గందరగోళం చోటు చేసుకుంటున్నది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు డజన్ మంది నాయకత్వం ఆధీనంలో రాజకీయం కొనసాగింది. పీసీసీ ఆదేశాలతో ఈ నియోజకవర్గం నుంచి పోటీచేసిన షబ్బీర్ అలీ రాకతో అంతా తామే అనుకున్న వారంతా వెనక్కి జరిగిపోయారు. ఓటమి చెందిన తర్వాత షబ్బీర్ అలీ అడపాదడపా వచ్చిపోతున్నారు. నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంలో పలు కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. అయితే తాజాగా ఎమ్మెల్సీగా పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్ గౌడ్ ఎన్నికవ్వడంతో ఇన్‌చార్జీగా ఎవరన్నది ఎటూ తేలడం లేదు. ఆది నుంచి అర్బన్ నియోజకవర్గంపై దృష్టి సారిస్తూ వచ్చిన మహేశ్ కుమార్ గౌడ్ పర్యవేక్షణలోనే నియోజకవర్గం కొనసాగుతుం దా? లేదంటే షబ్బీర్ అలీ ఆధీనంలో నాయకత్వం పని చేస్తుందా? తెలియడం లేదు.

### ఎవరి 'చేతిలో'...?

అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఓ విధంగా, తర్వాత మరో విధంగా అన్నట్లుగా మారింది హస్తం పార్టీలో పరిస్థితి. నిజామాబాద్ అర్బన్, ఆర్మూర్ నియోజకవర్గాలకు అభ్యర్థులే లేక తీవ్రంగా సంక్షోభంలో కొట్టుమిట్టాడిన కాంగ్రెస్ పార్టీకి ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తర్వాత నాయకత్వ ఇబ్బంది వెంటాడుతున్నది. ఇందులో ఆధిపత్య ధోరణి స్పష్టంగా కనిపిస్తున్నది. ప్రభుత్వం కొలువుదీరిన వెంటనే పదవుల పంపకాల కోసం, కీలకమైన స్థానాల్లో చోటు కోసం నాయకత్వం పోటాపోటీగా ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నది. ఎవరికి వారు అధిష్టానం దృష్టిలో పడేందుకు తహతహలాడుతుండగా నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంపై పెత్తనం కోసం కూడా పరుగులు తీస్తున్నారు. మొన్నటి శాసనసభ ఎన్నికల్లో అర్బన్ నుంచి అనూహ్యంగా షబ్బీర్ అలీ పోటీ చేసి ఓటమి చెందారు. ఆ తర్వాత ప్రభుత్వం రావడంతో సలహాదారు హోదాలో నియోజకవర్గానికి వచ్చిపోతున్నారు. ఎన్నికల సమయంలో కేటాయించినంత సమయాన్ని ఇప్పుడు శ్రేణులకు ఇవ్వలేకపోవడంతో హస్తం శ్రేణులు ఆగమాగమవుతున్నాయి. పీసీసీ ఆదేశాలతో ఏదైనా కార్యక్రమాలు తలపెడితే ఎవరి ఆధ్వర్యంలో నిర్వహించాలి..ఎవరిని ముఖ్య అతిథిగా పిలవాలి అన్న చర్చ ఇప్పుడు హస్తం నాయకత్వాన్ని పట్టి పీడిస్తున్నది. షబ్బీర్ స్థానాన్ని పూరించేందుకు పలువురు నేతలు నువ్వా నేనా అన్నట్లుగా నిలుస్తున్నప్పటికీ ఎమ్మెల్సీగా మహేశ్ కుమార్ గౌడ్ ఆ స్థానాన్ని భర్తీ చేస్తారా? లేదా అన్నది ప్రశ్నార్థకంగా మారింది. నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గ కార్యకర్తలకు మహేశ్ కుమార్ గౌడ్ రూపంలో అండ దొరుకుతుందా? లేదంటే షబ్బీర్ అలీనే నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా ఉంటారా? అన్నది కాంగ్రెస్ పార్టీ తేల్చాల్సి ఉంది.

### కామారెడ్డిపై కొండల్ రెడ్డి చూపు...?

కామారెడ్డి నియోజకవర్గంపై సీఎం రేవంత్ రెడ్డి సోదరుడు కొండల్‌రెడ్డి కన్నేసినట్లుగా ప్రచారం జరుగుతున్నది. అసెంబ్లీ ఎన్నికల్లో ఈ స్థానం నుంచి పీసీసీ చీఫ్ హోదాలో పోటీ చేసిన రేవంత్ రెడ్డి ఓటమి చెందారు. మూడో స్థానానికి పరిమితం అయ్యారు. రాష్ట్ర వ్యాప్త ప్రచారంలో భాగంగా సమయం లేకపోవడంతో ఇక్కడి బాధ్యతలను తన తమ్ముడు కొండల్ రెడ్డి, కొడంగల్‌కు చెందిన పలువురు ముఖ్యులకు అప్పగించారు. అసెంబ్లీ ఎన్నికలయ్యాక కామారెడ్డి సీటు కాస్త బీజేపీకి చిక్కడంతో పరిస్థితులు తారుమారు అయ్యాయి. షబ్బీర్‌కు కంచుకోట అనుకున్న కామారెడ్డి నియోజకవర్గం కాకుండా పోయింది. నిజామాబాద్ అర్బన్‌కు వలస వెళ్లి పోటీచేసి ఆయన ఓటమి చెందారు. దీంతో కామారెడ్డిపై పట్టు సాధించేందుకు షబ్బీర్‌కు అవకాశం లేకుండా పోయింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సలహాదారుగా ప్రభుత్వం నియమించినప్పటికీ క్యాబినెట్ ర్యాంకులో పలు అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటున్నప్పటికీ కామారెడ్డి నియోజకవర్గంపై షబ్బీర్‌కు భవిష్యత్తులో అవకాశం ఉంటుందా? లేదా? అన్నది తేలడం లేదు. పైగా నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంపైనా షబ్బీర్ చూపు కొనసాగుతుండడంతో ఎటూ అర్థం కాని దుస్థితి ఏర్పడింది. ఇదిలా ఉండగా కొండల్ రెడ్డి మాత్రం కామారెడ్డిపై ప్రత్యేకంగా శ్రద్ధ వహించినట్లుగా తెలిసింది. ఇక్కడి రాజకీయాలపై నిశితంగా పరిశీలన చేస్తుండగా కామారెడ్డి ప్రాంతానికి చెందిన కాంగ్రెస్ నాయకులకు సమయం కేటాయిస్తూ వారి సాధక బాధకాలను పంచుకుంటుండడం చర్చకు దారితీస్తున్నది.

## అన్నివర్గాలకూ కమ్యూనిటీ హాళ్లు నిర్మించాం

- బీఆర్ఎస్ కార్యకర్తలపై దౌర్జన్యం చేస్తే సహించేది లేదు
- స్వార్థం కోసం పార్టీలు మారే నాయకులు మనకొద్దు
- మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి

మోస్రా (చందూర్), ఫిబ్రవరి 25: బాన్సువాడ నియోజకర్గంలోని అన్ని కులాలు, వర్గాల వారికి బీఆర్ఎస్ హయాంలో కమ్యూనిటీ హాళ్లు, కల్యాణ మండపాలు నిర్మించి ఇచ్చామని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలపై దౌర్జన్యం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. మోస్రా మండల కేంద్రంలో నిర్మించిన మొటాడి రెడ్డి కల్యాణ మండపం ప్రారంభోత్సవానికి నిజామాబాద్ జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావుతో కలిసి ఆదివారం ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేశారు. అనంతరం నిర్మాణంలో ఉన్న మండల కార్యాలయాల సముదాయాన్ని పోచారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని అన్ని గ్రామాలు, కులాలు, మతాలకు సమ ప్రాధాన్యం ఇచ్చామన్నారు. మొత్తం 4వేల కమ్యూనిటీ హాళ్లు, 120 కల్యాణ మండపాలు మంజూరు చేశామని గుర్తుచేశారు. ప్రజల కోరిక మెరకు మోస్రాను కొత్త మండలంగా మార్చామని, రూ. 7.50 కోట్లతో ప్రధాన రహదారిపై సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుచేశామన్నారు.

### కార్యకర్తలను కడుపులోపెట్టి కాపాడుకుంటా..

అధికారం, పదవులు వస్తాయి.. పోతాయి అని, మనం చేసే మంచి పనే చిరస్థాయిగా నిలుస్తాయని అన్నారు. తన 20 ఏండ్ల రాజకీయ జీవితంలో ఎవరికీ అన్యాయం చేయలేదన్నారు. కొందరు నాయకులు స్వార్థం కోసం పార్టీలు మారడంపై ఎమ్మెల్యే స్పందించారు. ఎవరు పోయినా తనకు బాధలేదని, పొల్లు పోతే.. గట్టి మిగులుతుందన్నారు. తనకు అండగా నిలిచిన వారిని కడుపులో పెట్టుకొని కాపాడుకుంటానని స్పష్టం చేశారు. అధికార పార్టీ నాయకుల ప్రోత్బలంతో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై దౌర్జన్యం, హాని తలపెడితే ఊరుకునేదిలేదని హెచ్చరించారు. న్యాయం జరిగేవరకు వదిలిపెట్టనన్నారు. బీఆర్ఎస్‌కు త్వరలోనే మంచి రోజులు వస్తాయన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సురేందర్‌రెడ్డి, జడ్పీటీసీ గుత్ప విజయా భాస్కర్‌రెడ్డి, ఎంపీపీ పిట్ల ఉమా శ్రీరాములు, వైస్ ఎంపీపీ కత్తి శంకర్, మాజీ సర్పంచ్ సుమలతా రాంరెడ్డి, మాజీ సర్పంచులు నరేందర్, భూమయ్య, విమలాలింగయ్య, రెడ్డి సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఎడపల్లి మండలం జాన్కంపేట్ గ్రామంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ఆదివారం సంపూర్ణమయ్యాయి. చివరిరోజు ఆలయానికి భక్తులు పోటెత్తారు. జాన్కంపేట్ గౌడ సంఘం ఆధ్వర్యంలో కుస్తీ పోటీలను నిర్వహించగా.. భక్తులు ఆసక్తిగా తిలకించారు.

–ఎడపల్లి, ఫిబ్రవరి 25





ధర్పల్లిలో రోడ్డుపై నిలిచిన వర్షపునీరు

## పలుచోట్ల వర్షం

ధర్పల్లి, ఫిబ్రవరి 25 : నిజామాబాద్ జిల్లాలోని పలుచోట్ల ఆదివారం చిరుజల్లులు కురిశాయి. రెండు రోజులుగా ఆకాశం మేఘావృతమై చల్ల గాలులు వీస్తున్నాయి. ధర్పల్లి మండల కేంద్రంలో ఓ మోస్తరు వర్షం కురిసింది. దీంతో వరి సాగుచేస్తున్న రైతులు సంతోషం వ్యక్తంచేశారు. భూగర్భ జలాలు అడుగంటుతున్న నేపథ్యంలో బోరుబావులు వట్టిపోయి పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండురోజుల వర్షసూచన ఉండడంతో రైతులు వరణుడికోసం ఆశగా ఎదురు చూస్తున్నారు.

## నేడు 'భగీరథ' నీటి సరఫరా బంద్

బాన్సువాడ, ఫిబ్రవరి 25: జుక్కల్ సెగ్మెంట్ పరిధిలోని మిషన్ భగీరథ సింగూర్ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ ప్రధాన పైపులైన్‌కు లీకేజీ ఏర్పడడంతో మరమ్మతులు చేపట్టనున్నట్లు మిషన్ భగీరథ అధికారి వెంకటేశ్వర్‌గౌడ్ తెలిపారు. మరమ్మతుల నేపథ్యంలో సోమవారం నీటి సరఫరా నిలిపివేయనున్నట్లు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బాన్సువాడ,జుక్కల్, బోధన్ నియోజకవర్గాలతోపాటు ఎల్లారెడ్డి నియోజక వర్గ పరిధిలోని గ్రామాలకు నీటి సరఫరా ఉండదని తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని కోరారు.

## రాష్ట్రస్థాయి సేపక్‌తక్రా పోటీల్లో 'ఇందూరు' సత్తా

కంఠేశ్వర్, ఫిబ్రవరి 25 : నల్గొండ జిల్లాలో నిర్వహించిన 9వ రాష్ట్రస్థాయి సెపక్‌తక్రా జూనియర్, సబ్ జూనియర్ బాలబాలికల టోర్నమెంట్‌లో నిజామాబాద్ జిల్లా జట్లు సత్తాచాటాయి. బాలికలు సబ్ జూనియర్ విభాగంలో గోల్డ్ మెడల్, జూనియర్ విభాగంలో సిల్వర్ మెడల్ సాధించగా, బాలుర జట్టు జూనియర్ విభాగంలో మూడో స్థానంలో నిలిచిందని సెపక్‌తక్రా అసోసియేషన్ జిల్లా సెక్రటరీ సంజీవరెడ్డి తెలిపారు. ఆదివారం నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో క్రీడాకారులకు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లవెల్లి కరుణాకర్‌రెడ్డి బహుమతులను అందించడంతోపాటు అభినందనలు తెలిపారు. బహుమతుల ప్రదానోత్సవంలో డాక్టర్ ఎస్ఆర్ ప్రేమ్ రాజ్, హైదరాబాద్ అధ్యక్షుడు సురేశ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జగన్నాథ్ స్వామి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు జితేందర్, శ్రీనివాస్‌రెడ్డి, జరీపుద్దీన్, వెంకట్, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.




బహుమతులతో బాలబాలికల జట్లు



ఆలయ కమిటీ ప్రతిష్ఠించిన స్వామివారి విగ్రహం

# అభయమిచ్చే అనంత పద్మనాభుడు

- భక్తుల కొంగుబంగారం.. అనంత పద్మనాభస్వామి ఆలయం
- రేపటి నుంచి వారం రోజులపాటు ఆలయ బ్రహ్మోత్సవాలు
- ఏర్పాట్లు చేస్తున్న లక్ష్మాపూర్, మల్కాపూర్(ఏ)గ్రామస్తులు

**నిజామాబాద్ రూరల్** మండలంలోని మల్కాపూర్(ఏ) గ్రామశివారులో ఉన్న శ్రీలక్ష్మీ అనంత పద్మనాభ స్వామి ఆలయం భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతున్నది. భక్తి శ్రద్ధలతో పూజిస్తే కోర్కెలు నెరవేరుతాయని భక్తుల విశ్వాసం. గ్రామ శివారు గుట్ట ప్రాంతంలో ఒక గుహలో నర్సింహాస్వామి రూపంలో వెలసిన శ్రీలక్ష్మీ అనంత పద్మనాభ స్వామిగా భక్తుల పూజలందుకుంటున్నాడు. వృత్తాకారంలోనే శంఖ చక్రధారుడిగా వెలసి దినదినం తన రూపాన్ని పెంపొందించుకుంటూ భక్తుల కోర్కెలు తీరుస్తున్నాడు. అనంత పద్మనాభ స్వామి ఆలయ ఉత్సవాలు ఈనెల 27 నుంచి మార్చి 3 వరకు నిర్వహించనున్నారు. ఇందుకోసం లక్ష్మాపూర్, మల్కాపూర్(ఏ) గ్రామాల అభివృద్ధి కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఏటా మాఘమాసంలో తదియ నుంచి అష్టమి వరకు వారం రోజుల పాటు నిర్వహించనున్న బ్రహ్మోత్సవాలకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచే కాకుండా కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు వేల సంఖ్యలో తరలివస్తారు.

– సారంగాపూర్, ఫిబ్రవరి 25



గర్భగుడిలోని మూలవిరాట్


చిన్నబిందు రూపంలో వెలసిన శ్రీలక్ష్మీ అనంత పద్మనాభ స్వామి క్రమక్రమంగా పెరుగుతూ పూర్తి రూపాన్ని సంతరించుకున్నాడు. ఇరుకైన రాళ్ల మధ్యలో శంకు, చక్రం, వక్షస్థల, వాయాంశంపై కొలువుదీరిన శ్రీలక్ష్మీ సహిత అనంత పద్మనాభుడిగా భక్తులకు దర్శనమిస్తున్నారు. స్వామి వారి నిజరూపం గుహలో ఇరుకైన రాళ్ల మధ్యలో చిన్న ఖాళీ స్థలంలో ఉంది. భక్తుల సౌలభ్యం కోసం అదే గుహలో కింది భాగంలో మరో విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఏటా భాద్రపద మాసంలో అనంత చతుర్దశి రోజున నిర్వహించే అనంత పద్మనాభుడి వ్రతం అత్యంత శక్తివంతమైందని భక్తుల విశ్వాసం. పవిత్రమైన దీక్షతో ఏడు శిరస్సులు కలిగిన సర్ప రూపంలో అనంత పద్మనాభ స్వామిని ప్రతిష్ఠించి ఆ ప్రతిమను 16 నూలు పోగులతో తయారుచేసిన మాలను అలంకరించి అత్యంత పవిత్రంగా నియమ నిష్ఠలతో వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య వ్రతాన్ని ఆచరిస్తారు.

### 27 నుంచి బ్రహ్మోత్సవాలు

ఈ నెల 27 నుంచి ఆలయ బ్రహ్మోత్సవాలు ప్రారం భం కానున్నాయి. మొదటి రోజు అంకురారోహణ రుత్వికుల దీక్షాధారణ, హారతి, మంత్రపుష్పం, 28న సుప్రభాత సేవ, ధ్వజారోహణం, 29న మధ్యాహ్నం శ్రీలక్ష్మీ అనంతపద్మనాభ స్వామి వారి కల్యాణోత్సవం, మార్చి 1న డోలారోహణం, 2న రథోత్సవం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నారు.3న ఉదయం పూర్ణాహుతి, చక్రతీర్థం, నాగవెల్లి, ద్వాదశావర్ణపూజ, సప్తావరణ పూజలు, దేవతా ఉద్వాసన, భూతబలి, ఏకాంత సేవతో బ్రహ్మోత్సవాలు సంపూర్ణమవుతాయి.

### దాతల సహకారంతో అష్టముఖి కోనేరు నిర్మాణం

నలుగురు దాతలందించిన విరాళాలతో ఆలయ ఆవరణలో రూ.3లక్షలతో అష్టముఖి కోనేరుగా కొత్తగా నిర్మించారు. ఈ కోనేరును ఇటీవల స్థానిక ఎమ్మెల్యే భూపతిరెడ్డి గ్రామపెద్దలతో కలిసి సందర్శించారు. రూ.60లక్షలతో బీటీ, సీసీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఆలయ ముఖ ద్వారాం నుంచి ఆలయం పైవరకు, ఆలయ ఆవరణలో సీసీ రోడ్డును నిర్మించనున్నారు.





ట్రోఫీతో జిల్లాకు చెందిన క్రీడాకారిణులు

## జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ

కంఠేశ్వర్, ఫిబ్రవరి 25 : బిహార్ రాష్ట్రంలోని పాట్నాలో నిర్వహించిన 41వ జాతీయ స్థాయి జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో నిజామాబాద్ జిల్లా క్రీడాకారులు ప్రతిభ చాటారు. ఈ నెల 21 నుంచి 25వ తేదీ వరకు జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో తెలంగాణ రాష్ట్ర బాలికల జట్టు.. కేరళ జట్టుపై 10-9 తేడాతో విజయం సాధించింది. రాష్ట్ర జట్టు గెలుపులో జిల్లా క్రీడాకారులు అజ్మీరా ఇందు (కెప్టెన్), గోక శ్రావిక, గోక సాత్విక, కెతావత్ సోని కీలకపాత్ర పోషించి బంగారు పథకాలు అందుకున్నట్లు సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రభాకర్‌రెడ్డి, మర్కంటి గంగామోహన్ తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారులను జిల్లా చైర్మన్ బద్దం లింగారెడ్డి, రాష్ట్ర ప్రధానకార్యదర్శి నవీన్ కుమార్, ఉపాధ్యక్షులు శోభన్‌బాబు, అభిషేక్‌గౌడ్, ఇండియా కోచ్ కృష్ణ, సంగీతారావు, టి.విద్యాసాగర్‌రెడ్డి, బొజ్జ మల్లేశ్, నీరజారెడ్డి, జైపాల్‌రెడ్డి తదితరులు అభినందనలు తెలిపారు.